కథ

# నమ్మకం

పోలా పద్మినీదేవి

**ఇన్‌పేషెంట్స్‌ని చూసి నైట్ డ్యూటీ నర్సులకి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ఇంటికెళ్దామని మేడ మెట్లు ఎక్కబోతుండగా అప్పుడే గేటు బయట లాన్సర్ కారు ఆగింది. కారు దిగి, గేటులో నుంచి లోపలకి వస్తున్న ఆ వ్యక్తిని ఎన్ని సంవత్సరాల తరువాతయినా గుర్తించగలను. అతను అనంత్.**

నన్ను చూసి షాక్‌తిన్న భావం అతని ముఖంలో. ''నువ్వా! నువ్వు...ఇక్కడ...డాక్టరు పూజిత అంటే ఎవరో అనుకున్నాను'' అన్నాడు నమ్మలేనట్టు చూస్తూ.

''ఎస్!'' అన్నాను. నీకేం కావాలో చెప్పమన్నట్టు చూస్తూ.

''నా వైఫ్ ప్రెగ్నెంట్. మా అత్తవారిది ఈ పక్క ఊరే. నిజానికి డాక్టరిచ్చిన డేట్‌కి ఇంకా వారం రోజులు టైమ్ ఉంది. ఉన్నట్టుండి, పెయిన్స్ వస్తున్నాయి'' అతను నన్ను చూసిన షాక్ నుంచి ఇంకా తేరుకోలేదనుకుంటాను. ఒకదానికొకటి పొంతన లేకుండా మాట్లాడాడు. పెయిన్స్ అనే మాట వినగానే క్షణం కూడా ఆలస్యం చేయలేదు నేను. వెనుదిరిగి స్టాఫ్‌ని పిలిచి వీల్‌చైర్ తెమ్మన్నాను.

అనంత్ చప్పున కారు డోర్ తెరిచాడు. కారు వెనుక సీట్లో పడుకుని ఉన్న ఆమె బాధతో పెద్దగా మూలుగుతోంది. సందేహం లేదు. లేబర్ పెయిన్సే.

ఆమెని లేబర్‌రూమ్‌కి తరలించి పరీక్షించాను. బ్లీడింగ్ కూడా స్టార్టయింది. నెప్పులు ఎక్కువ అవ్వడానికి ఇంజక్షన్ ఇచ్చి నర్సుని ఆమె దగ్గర ఉంచి బయటకొచ్చాను. బయట వరండాలో పచార్లు చేస్తున్న అనంత్‌లో ఆందోళన, అలజడి సుస్పష్టమవుతున్నాయి. ఆ క్షణంలో అతన్ని చూస్తే అతను పెద్ద డాక్టరని, పేరు పొందిన కార్డియాలజిస్టని ఎవరూ అనుకోరు. భార్య లేబర్ రూమ్‌లో ప్రసవవేదన పడుతుంటే బయట అశాంతిగా, ఆందోళనగా పచార్లు చేస్తున్న ఒక మామూలు భర్తలా ఉన్నాడు. నిజానికి అతనూ మనిషేగా. భార్య గురించి ఆందోళన పడడం సహజమేగా..

నన్ను చూసి ఆదుర్దాగా అడిగేడు. ''నా వైఫ్‌కెలా ఉంది?''

''మరో గంటలో డెలివరీ అవుతుంద''ని చెప్పాను.

''ఫూల్! ఈ స్థితిలో ప్రయాణం చేయడం మంచిది కాదంటున్నా వినకుండా అమ్మని చూస్తానని బయలుదేరింది. ఈ పల్లెటూర్లో..ఈ హాస్పిటల్‌లో'' గొణుక్కున్న అతను నా వైపు చూస్తూ అడిగేడు.

''నీ హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్ ఉందా? ఒకవేళ నార్మల్ డెలివరీ కాకపోతే...''

''ఉంది. నీ భార్యని, బిడ్డని క్షేమంగా అప్పగించే పూచీ నాది సరేనా?'' నవ్వి తిరిగి లేబర్‌రూమ్‌లోకి నడిచాను.

ఆమె హృదయ విదారకంగా అరుస్తోంది.

''రిలాక్స్!'' అంటూ ఆమెచేత బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్న నాకు లేతగా, నాజుగ్గా ఉన్న ఆమె ముఖం, పెదవిపైన పుట్టుమచ్చ సుపరిచితమైనవిగా అనిపించాయి. ఈమెని ఎక్కడో చూశాను. అనంత్ భార్యగా కాదు. ఎప్పుడు? ఎక్కడ చూశాను? నా మనసు పాత జ్ఞాపకాలని రీ కలెక్ట్ చేసుకుంటోంది.

మూడు సంవత్సరాల క్రిందట ఒక రాత్రి క్లినిక్ మూసేసి ఇంటికెళ్లబోతుండగా నడివయసు దంపతులు, ఒక యువతి వచ్చారు. వాళ్ల రాకతో తిరిగి కన్సల్టేషన్ రూమ్‌లోకి నడిచాను. విషయం నేనూహించినదే. ఆమె వాళ్ల అమ్మాయి. ఆమె ఎవరినో ప్రేమించింది. అతనామెని మోసం చేశాడు. నెల తప్పిన ఆమెని అబార్షన్ కోసం నా దగ్గరకి తీసుకొచ్చారు ఆ దంపతులు.

''ఈ విషయం లోకానికి తెలిస్తే నా పరువుపోతుంది. దీని కడుపులో పెరుగుతున్న ఆ పాపాన్ని కడిగేసి పుణ్యం కట్టుకోండమ్మా!'' బావురుమన్నారు ఆ దంపతులు.

తల దించుకుని కూర్చుని ఉన్న ఆమె కన్నీళ్లు ఎదని తడుపుతున్నాయి. నాకు జాలివేసింది.

ఆమెని పరీక్షించి మరిన్ని వివరాలడిగి ఆమె మూడవ నెల గర్భిణీ అని నిర్ధారించుకున్నాక చెప్పాను.

''రేపు ఉదయం ఏడు గంటలకి అబార్షన్ చేస్తాను'' అన్నాను. ఏడుస్తున్న ఆ అమ్మాయిని జాలిగా చూస్తూ.

శరీరంలోని ఏ భాగానికి గాయమైనా చెప్పుకోగలం. అందుకు ఎంతో కొంత సానుభూతి, కన్సిడరేషన్ ఉంటాయి. కానీ మోసపోయి గర్భవతి అయిన ఆడపిల్ల ఆ విషయాన్ని పైకి చెప్పుకోలేదు. శీలం గురించి ఆడవాళ్లకి ఎంత బలమైన నమ్మకం ఉంటుందో నాకు తెలుసు. నేనామెకి అబార్షన్ చేసి ఈ బెడద నుంచి ఆమెని తప్పించి మామూలు మనిషిని చేసినా ఆమె మానసికంగా ఎప్పటికీ మామూలు మనిషి అవ్వదు. తను శీలాన్ని కోల్పోయిందనే గిల్ట్ కాంప్లెక్స్‌తో జీవితాంతం బాధపడుతూనే ఉంటుంది. నేను చాలా రోజుల పాటు ఆమెని మరచిపోలేకపోయాను. ఆమె ఇప్పుడు అనంత్ భార్యగా నా హాస్పిటల్‌కి డెలివరీ కోసం రావడం యాధృచ్ఛికమే అయినా నేనెందుకో ఆమెని అనంత్ భార్యగా ఊహించుకోలేకపోతున్నాను.

ఆలోచనలలో నుంచి తేరుకుని చేతులకి గ్లవ్స్ తొడుక్కున్నాను. మరో పది నిమిషాల తర్వాత ఆమె పండంటి మగబిడ్డకి జన్మనిచ్చింది.

మరో పావుగంట తరువాత స్ట్రెచర్‌పై ఆమెని రూమ్‌కి తరలించాను.

''కంగ్రాచ్యులేషన్స్! మగబిడ్డ'' బయటకి వస్తూనే అనంత్‌తో చెప్పాను. అంతవరకు అతనిలో ఉన్న టెన్షన్ మాయమై ఏదో రిలీఫ్. దాన్ని మించిన ఆనందం కనిపించాయి అతని ముఖంలో.

''మీరు మీ వైఫ్‌ని, బాబుని చూడొచ్చు''

''థాంక్యూ! నా వైఫ్‌ని ఇప్పుడు నాతో వైజాగ్ తీసుకెళ్లకూడదా? కారులో ప్రయాణమే కదా!''

''నార్మల్ డెలివరీ అయినా పేషెంట్‌ని, బేబీని 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలి. నీకీ విషయం తెలిసి ఉండాలే. నువ్వూ డాక్టర్‌వే కదా!'' అన్నాను.

అనంత్ తన తప్పు తెలుసుకున్న వాడిలా భుజాలు ష్రగ్ చేశాడు.

''ఓ.కె. నువ్వెప్పుడు డిశ్చార్జ్ చేస్తే అప్పుడే తీసుకెళ్తాను'' అన్నాడు.


నేను ముందుకి నడిచాను.

★ ★ ★

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఆమె అనంత్ భార్య? నేనింకా నమ్మలేకపోతున్నాను. ఆమె తను ఎవరినో ప్రేమించి మోసపోయిన సంగతి, అబార్షన్ చేయించుకున్న సంగతి దాచి అతన్ని పెళ్లి చేసుకుని ఉండొచ్చు. కానీ అనంత్! శీలానికి అతనెంత విలువనిస్తాడో నాకు బాగా తెలుసు. స్త్రీల పట్ల అతనికెంత అపనమ్మకం? ఆ అపనమ్మకమే కదూ నాలుగేళ్ల మా ప్రేమ పునాదికి బీటనిచ్చింది? నాకు గతం గుర్తుకొస్తోంది.

వైజాగ్ మెడికల్ కాలేజీలో చదువుతున్నప్పుడు అనంత్ నా క్లాస్‌మేట్. మేమిద్దరం బ్రిలియంట్

స్టూడెంట్స్‌మే కావడం వలన మా మధ్య సహజం గానే పోటీ ఉండేది. మా మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. ముందు కెరీర్, తర్వాతే పెళ్లి అని నిర్ణయించుకోవడం వలన జన్మతః వచ్చిన సంస్కారం వలన మేము ఏకాంతంలో కూడా ఎప్పుడూ హద్దులు దాటలేదు. మా కులాలు ఒకటే కావడం వలన ఇరువైపుల పెద్దలూ మా ప్రేమకి ఆమోదముద్ర వేశారు.



నేను ఫైనలియర్ చదువుతున్నప్పుడు జరిగిందా సంఘటన.

కాలేజీ నుంచి కెనటిక్ హోండాపై ఇంటికి వస్తు న్నాను. మా ఇంటికి వంద గజాల దూరంలో ఉండగా సడన్‌గా స్ట్రీట్‌లైట్లు ఆరిపోయాయి. పవర్ కట్ అనుకుంటాను. శీతాకాలం కావడం వలన ఏడు గంటలకే చీకటి పడింది. నా పక్కగా వచ్చిన కారు స్లో అయి నా వెహికల్‌ని ఓవర్‌టేక్ చేసి దారికి అడ్డంగా ఆగడం గమనించి తుళ్లిపడి సడెన్‌బ్రేక్ వేశాను. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగి నన్ను సమీపించడం చూసి షాక్‌తో బిగుసుకుపోయాను. నేను ఆ షాక్‌లో నుంచి తేరుకోకుండానే వాళ్లు నన్ను సమీపించడం, కెవ్వుమనబోయిన నా నోటి దగ్గర రుమాలుని అదిమిపట్టడం జరిగిపోయింది. క్లోరోఫామ్ వాసన, కళ్ల ముందు చీకటి వలయాలు, నాకు స్పృహ తప్పడం తెలుస్తూనే ఉంది.

తిరిగి నాకు స్పృహ వచ్చేసరికి పరిసరాలు ముందు అస్పష్టంగా కనిపించి తరువాత స్పష్టంగా కనిపించాయి. అది ఒక విశాలమైన గది. పాదాల కింద మెత్తని తివాచీ, గది నాలుగు గోడలకి ఖరీదైన పెయింటింగ్స్. ఎ.సి. పని చేస్తున్న సన్నని ధ్వని. దిగ్గున సోఫాలో నుంచి లేచాను. 'ఎవరు నన్ను కిడ్నాప్ చేసిన వ్యక్తి? ఏ ప్రయోజనాన్ని ఆశించి ఆ ఘాతుకానికి పాల్పడ్డాడు?' క్రమేపీ జరిగి నది గుర్తుకొచ్చి నా మనసులో ఉదయించిన ప్రశ్నలవి.

నా శరీరంలోని వణుకు, గుండె కొట్టుకుంటున్న వేగం స్పష్టంగా తెలుస్తోంది.

''మెళకువ వచ్చిందా? గుడ్!'' పక్క నుంచి వినిపించింది. అదిరిపడి తల తిప్పాను.

విక్రమ్!

నా క్లాసుమేట్. అతనొక రాజకీయ నాయకుడి కొడుకు. కాలేజీలో అతనికి రౌడీ అని పేరు ఉంది. ఆడపిల్లలే కాదు అబ్బాయిలు కూడా అతనికి భయపడతారు. ప్రాక్టికల్ జోక్స్ పేరుతో దారుణంగా అందరినీ ఏడిపిస్తుంటాడు. అలాంటి విక్రమ్ ఇప్పుడు నన్ను కిడ్నాప్ చేశాడు. నాలో రక్తప్రసరణ ఆగినట్లయింది. అతను నన్ను చూసి నవ్వేడు. నాకా నవ్వు వికృతంగా వినిపించింది.

''నన్నెందుకు కిడ్నాప్ చేశావ్?'' గొంతు పొడారిపోతున్నా నిలదీస్తున్నట్లు అడిగాను.

''వయసులో ఉన్న అందమైన ఆడపిల్లని నా లాంటి మగవాడు ఎందుకు కిడ్నాప్ చేస్తాడు?'' ఎదురు ప్రశ్నించాడు.

''నన్ను...నన్నేం చెయ్యకు ప్లీజ్!'' చేతులు జోడిస్తూ అన్నాను కన్నీళ్లతో.

''అరె! ఎందుకంత భయపడిపోతున్నావ్? రిలాక్స్!'' అన్నాడు విక్రమ్.

''నన్ను ఇంటికి పంపించు. నాకోసం మా అమ్మ, నాన్న బెంగపెట్టుకుంటారు.''

''అనంత్ బెంగ పెట్టుకోడా?'' నవ్వేడు. నా కళ్లలో నిండుగా ఊరిన కన్నీళ్లు చెంపలపైకి జారాయి.

''సర్లే! నిన్నేమీ చెయ్యను కానీ ఒక పాట పాడు'' నాకెదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని సిగరెట్ వెలిగించా

కుంటూ అన్నాడు.

''నాకు పాటలు రావు.''

''సినిమా పాటలు కూడా రావా?''

''పూర్తిగా రావు'' నన్ను కిడ్నాప్ చేసి మరీ పాటలు పాడించుకోడానికి నేను అంత గొప్ప గాయనినా అని ఆశ్చర్యం వేసింది నాకు.

''నీకు వచ్చిందే పాడు.''

వణుకుతున్న స్వరాన్ని అదుపులోకి తెచ్చుకోకుండానే పాడాను.

''అనగనగా ఆకాశం ఉంది. ఆకాశంలో మేఘం ఉంది.''

''ఫెంటాస్టిక్! మరో పాట పాడు.''

''గోరింట పూచింది కొమ్మా లేకుండా'' పాడాను.

''సుపర్బ్! మరోటి పాడు.''

నాకు అనంత్, చదువు తప్ప మరో ప్రపంచం లేదు. నేను మెడిసిన్‌లో చేరాక సినిమా చూడలేదు. టీవీ చూడ్డానికి టైమ్ లేదు. ఏ పక్కింటి వాళ్ల టేపరికార్డర్‌లో నుంచో గాలిలో తేలి వచ్చి ఒకటి, అర ముక్కలు చెవిన పడినవే గుర్తున్నాయి. అవే పాడుతున్నాను.

మనసులో భయం. ఏ క్షణంలోనైనా ప్రమాదం ముంచుకొస్తుందని. నా ఊహకే విరుద్ధంగా విక్రమ్ నా చిటికెన వేలిగోరుని కూడా తాకలేదు. రాత్రంతా అలా పాడుతూనే ఉన్నాను. నేను పాడిన ప్రతీ పాటకి అతను చప్పట్లు కొట్టి నన్ను అభినందిస్తూనే ఉన్నాడు.

నా చేతికి ఉన్న వాచ్ ఉదయం 5 గంటలు కావస్తోందని సూచిస్తోంది.

''స్వీట్ వాయిస్! నువ్వు సంగీతం ఎందుకు నేర్చుకోకూడదూ?'' అడిగేడు.

''చదువు పూర్తయి డాక్టరుగా స్థిరపడ్డాక ఆలోచిస్తాను'' అన్నాను. 'ఇంకనైనా వదలరా బాబూ' అన్నట్టు ముఖం పెట్టి.

''ఐ ఎప్రిషియేట్ యూ! పద. నిన్ను మీ ఇంటి దగ్గర దింపుతాను'' అన్నాడతను కుర్చీలో నుంచి లేస్తూ.

పంజరంలో నుంచి బయట పడినట్టు అతన్ని అనుసరించాను.

గేటు తీసుకుని లోపలకి అడుగు పెడుతున్న నన్ను ముందు అమ్మ చూసింది. రాత్రంతా నేను ఇంటికి రాలేదనే ఆందోళన నన్ను చూసిన ఆనందంగా మారగా గభాల్న ఎదురొచ్చి కన్నీళ్లతో, నన్ను కౌగిలించుకుంది. ఎప్పుడూ మేరుపర్వతంలా నిబ్బరంగా ఉండే నాన్నగారి కళ్లలో నీళ్లు చూసి చలించిపోయాను.

''రాత్రయినా నువ్వు ఇంటికి రాలేదని అంకుల్ కంగారుపడి ఫోన్ చేస్తే నీ కోసం నీ ఫ్రెండ్స్ అందరి ఇళ్లూ వెతికి విసిగిపోయాను. ఎక్కడికెళ్లావు పూజా?'' అనంత్ స్వరం విని తల తిప్పాను. అంతవరకు అతనక్కడ ఉన్న విషయాన్ని గమనించలేదు నేను.

అక్కడ అమ్మ, నాన్న ఉన్నారని మరచిపోయి రాత్రంతా నేను పడిన టెన్షన్ అనుభవించిన మానసిక వ్యధ కరిగిపోయేలా ఏడుస్తూ ఒక్కంగలో అతన్ని సమీపించి హత్తుకుపోయాను.

''నన్ను విక్రమ్ కిడ్నాప్ చేశాడు'' వెక్కిళ్ల మధ్య చెప్పాను.

క్షణం ఆ గదిలో గాలి స్తంభించిపోయిందేమో అనిపించింది. సూది కింద పడితే వినిపించేంత నిశ్శబ్దం అలుముకుంది.

అనంత్ నన్ను దూరంగా జరిపాడు. అతన్ని కళ్లు కొలిమిలో కాలిన ఉక్కులా మండుతున్నాయి. అతను ఏడుస్తున్న నన్ను ఓదార్చలేదు. నీకు నేనున్నానని ధైర్యం చెప్పలేదు. అసలేం జరిగిందని అడగలేదు.

నా చేయి పట్టి గదిలోకి లాక్కెళ్లాడు. ''చెప్పు, విక్రమ్ నిన్నేం చేశాడు?'' నిలదీస్తున్నట్టు కాదు నన్ను నిలువునా చీలుస్తున్నట్టుందా చూపు.

''నన్ను పాట పాడమన్నాడు''

''వ్వాట్?'' అతని స్వరంలో అపనమ్మకం! కళ్లల్లో అనుమానం.

''అవును. అతను ప్రాక్టికల్ జోక్స్‌తో ఎంతమందిని ఎన్ని రకాలుగా ఏడిపిస్తాడో నీకూ తెలుసు కదా? నేను భయపడిన ప్రమాదమేమీ అతని నుంచి ఎదురవ్వలేదు. పాట పాడమన్నాడు. ఒకదాని తర్వాత మరొకటి. రాత్రంతా పాడుతూనే ఉన్నాను''

''అవును. నువ్వో లతామంగేష్కర్‌వి కదా'' అతని స్వరంలోని వ్యంగ్యాన్ని నేను గమనించకపోలేదు. ''ఇంత అందంగా ఉన్న నిన్ను రాత్రంతా ఎదురుగా ఉంచుకుని నిన్నేమీ చేయకుండా పాటలు మాత్రం పాడించుకుని పవిత్రంగా నిన్ను ఇంటి దగ్గర దింపాడు. అది నేను నమ్మాలి''

''నువ్వు నమ్మినా, నమ్మకపోయినా అది నిజం. సహనాన్ని కూడదీసుకుంటూ అన్నాను.

''నేను నమ్మాలంటే నువ్వు పవిత్రురాలివని నిరూపించుకోవాలిగానీ''

''ఏం చెయ్యమంటావ్?'' నిస్సహాయంగా అడిగాను.


''నీపై అత్యాచారం జరగలేదని డాక్టర్ ధృవీకరిస్తే నమ్ముతాను. నువ్వు పవిత్రురాలివని రుజువైతే తప్ప మన పెళ్లి జరగదు''

అతనన్న ప్రతీ మాట నా గుండెని తూట్లు పొడుస్తుంటే నిరుత్తరురాలినై చూస్తున్నాను. తలలో నరాలు చిట్లిపోతున్నట్టు బాధ. చెవులలో హోరు. నా శరీరం అవమానంతో రగిలిపోతోంది. ''నడు డాక్టరు దగ్గరకి'' అతని స్వరంలోని శాసనానికి నా ఒళ్లంతా కారం రాసినట్టయింది. అవమానంతో కూడిన ఆగ్రహంతో నిలువెల్లా కంపిస్తూ అన్నాను.

''పెళ్లికైనా ప్రేమకైనా పునాది నమ్మకం. నమ్మకం లేని చోట ప్రేమ ఉండదు. విక్రమ్ నాపై అత్యాచారం చేశాడని నీ అను

## కితాబు

***హీరోలు కొంతమంది తారలతో కలిసి నటించడం తమకెంతో బాగుంటుందంటుంటారు. హిందీ, తమిళ భాషల్లో నిర్మితమవుతున్న కొత్త చిత్రంలో మాధురీదీక్షిత్‌తో కలిసి నటిస్తున్న కమల్‌హాసన్ మాధురీ గురించి కితాబులిస్తున్నాడు. 'ఆమె సింప్లిసిటీ, క్రమశిక్షణ, కలుపుగోలు తనం అందర్నీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమా నాకు కలకాలం గుర్తుండిపోతుంది' అంటున్నాడు కమల్. అది ఎంతవరకు నిజమో!***



మానం. నిజంగా అదే గనుక జరిగి ఉంటే నేను ఈపాటికి ఆత్మహత్య చేసుకునే దాన్ని. నీకు నాపై నమ్మకం లేదు. నిన్ను నమ్మించడానికి నా ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టవలసిన అవసరం నాకు లేదు. మన పెళ్లి జరగకపోవడమే మంచిది. గుడ్‌బై!''

నా నుంచి అలాంటి జవాబు ఊహించని అనంత్ నన్ను మాడ్చేసేలా చూసి విసురుగా వెళ్లిపోయాడు. నేను గది బయటకొచ్చేప్పటికి ఎదురుగా అమ్మ, నాన్న నిలబడి ఉన్నారు. వాళ్ల ముఖాలు చూస్తే మా మధ్య జరిగిన సంభాషణని వాళ్లు విన్నారని అర్థమయింది. అమ్మ ఏడుస్తోంది. నాన్న అభినందిస్తున్నట్టు నా భుజం తట్టారు.

నేను మామూలుగానే కాలేజీకి వెళ్తున్నాను. విక్రమ్ నన్ను కిడ్నాప్ చేసిన విషయం అందరికీ తెలిసిపోయింది. కొందరి కళ్లల్లో సానుభూతి, మరి కొందరి కుతూహలం, అవహేళనలని పట్టించుకోకుండా నిర్లిప్తతని అలవరచుకోడానికి చాలా కష్టపడ్డాను.

విక్రమ్ ఒకరోజు నా దగ్గరకి వచ్చాడు. ''అయామ్ సారీ! ఎక్స్‌ట్రీమ్లీ సారీ! సరదాగా చేశాను. దాని పర్యవసానం ఇంత దారుణంగా ఉంటుందనుకోలేదు. అనంత్‌ని నువ్వెంత గాఢంగా ప్రేమించావో నాకు తెలుసు. నీ పెళ్లి చెడిపోవడానికి కారకుడిని నేను'' అతని గొంతులో కళ్లలో నిజాయితీతో కూడిన బాధ కనిపించింది నాకు.

''నేను అనంత్‌ని ప్రేమించినంతగా అతను నన్ను ప్రేమించలేదు. మా పెళ్లి జరగబోవడం లేదని నేనేం బాధ పడడం లేదులే!'' అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

నా మనసులో అనంత్ చేసిన గాయం మానుపట్టడానికి చాలా రోజులు పట్టింది. అవమానంతో ప్రజ్వరిల్లుతున్న నా మనసుకి 'చదువు' అనే మందుతో స్వాంతన లభించింది. రాత్రింబగళ్లు చదివాను. కసితో...తపనతో...ఆర్తితో చదివాను. యూనివర్సిటీ ఫస్ట్‌లో పాసయ్యాను. పి.జి. ఎంట్రెన్స్‌లో గైనకాలజీలో సీటు వచ్చింది. పి.జి. పూర్తవ్వగానే సిటీలోని ఒక కార్పొరేట్ హాస్పిటల్‌లో కొన్నాళ్లు పనిచేశాను. మా పనిమనిషి నర్సమ్మ కూతురు, పల్లెటూరిలో కాన్పు, కష్టమై చనిపోయినప్పుడు పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టాలనే నా ఆలోచనకి బీజం పడింది.

అది మొలకెత్తి నానాటికీ మహావృక్షమయింది. నా ఆశయానికి అమ్మ అభ్యంతరం పెట్టినా నాన్నగారు మాత్రం మనసారా ఆశీర్వదించారు.

తలుపు తట్టిన శబ్దమయింది.

★ ★ ★

తలుపు తట్టిన శబ్దమయింది.

''ఎస్. కమిన్!'' అన్నాను సరిగ్గా కూర్చుంటూ.

అనంత్ లోపలకి వచ్చాడు.

''కూర్చో!'' అన్నాను.

''మొత్తానికి ఈ పల్లెటూళ్లో సెటిలయ్యావన్నమాట'' అన్నాడతను కూర్చుంటూ. ''ఏం సంపాదించగలవ్ ఈ పల్లెటూళ్లో?''

''నేను బతకడానికి, పదిమందిని బతికించడానికి సరిపడేనంత''

''ఏముందీ పల్లెటూళ్లో? అసలు ఇక్కడ ఇంత పెద్ద నర్సింగ్ హోం కట్టించడం అవసరమా?''

''పల్లెటూళ్లో ఉండే వాళ్లు మనుషులు కారా? వాళ్లకి డాక్టర్‌తో అవసరం రాదా? నేను ఇక్కడ ఉండబట్టే కదా నిన్న నీ భార్యకి సర్వీస్ చేయగలిగాను'' నవ్వుతూనే చురుగ్గా చూస్తూ అన్నాను.

''సో! ఇక్కడ హేపీగానే ఉన్నావన్నమాట!''

''చాలా!'' నొక్కి పలుకుతూ అన్నాను. నాకు మొదటిసారిగా అనిపించింది అతను నా శీలంపై అపనమ్మకంతో కాకపోయినా పల్లెటూరిలో ప్రాక్టీసు పెట్టాలనే నా ఆశయాన్ని వ్యతిరేకించి అయినా నన్ను తిరస్కరించి ఉండేవాడని.

''నా సంగతి అడగవేం?''

''నువ్వు హేపీగానే ఉన్నావని నిన్ను చూస్తేనే అర్థమవుతోంది. వేరే అడగాలా?''

''నిజం. చాలా హేపీగా ఉన్నాను. సంఘంలో గౌరవం, రెండు చేతులా సంపాదన. అన్నింటినీ మించి అనుకూలవతి అయిన భార్య దొరకడం నా అదృష్టం. నా భార్య పవిత్ర...పేరుకి తగ్గట్టు పవిత్రే. మగవాళ్లతోనే కాదు ఆడవాళ్లతో కూడా తలెత్తి మాట్లాడదు. నేను ఎలా చెప్తే అలా నడుచుకుంటుంది'' అతని స్వరంలో చిరు గర్వం.

పవిత్ర ఆడవాళ్లతో కూడా తలెత్తి మాట్లాడలేనంత బిడియస్తురాలు కాదని, తను భర్తనే కాదు లోకాన్ని కూడా మోసం చేస్తోందనే గిల్టీ కాన్షస్‌తో బాధపడుతోందని తెలిస్తే ఈ మానవుడేమయిపోతాడా అనిపించింది నాకు.

''పవిత్రా! ఈ డాక్టరెవరనుకున్నావ్? మెడిసిన్‌లో నా క్లాస్‌మేటు. పరిస్థితులు అనుకూలించక ఆశయం పేరుతో ఈ పల్లెటూళ్లో ప్రాక్టీసు పెట్టింది కానీ అన్నీ సవ్యంగా ఉండి ఉంటే ఒక పెద్ద డాక్టరుకి భార్యగా సిటీలో రెండుచేతులా సంపాదిస్తూ ఉండేది'' రౌండ్స్‌కొచ్చిన నన్ను పరిచయం చేస్తున్నట్టు భార్యతో అనంత్ అన్న మాటలలోని వ్యంగ్యం చురుక్కుమనిపించింది నాకు. తల తిరిగిపోయేలా జవాబు చెబుదామనుకుని సంస్కారం అడ్డొచ్చి ఆగిపోయాను.

గత రాత్రి పురుటి నెప్పుల బాధలో ఉన్న ఆమె నన్ను గుర్తు పట్టలేదు కానీ, ఇప్పుడు నన్ను గుర్తుపట్టిందని, కానీ నేనెవరినో తెలియనట్టు నటిస్తోంది నాకు తెలుసు. నేను అనంత్ క్లాస్‌మేట్‌నని తెలిశాక ఆమె నావైపు చూసిన చూపులో భయాన్ని, మ్లానమైన ఆమె ముఖాన్ని చూసి కళ్లతోనే అభయమిచ్చి ధైర్యాన్నిస్తున్నట్టు ఆమె చేతిని నొక్కాను.

మరునాడు పవిత్రని డిశ్చార్జి చేసేశాను. పసిబిడ్డని ఎత్తుకున్న ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి కారు దగ్గరకి నడిపించుకుని వెళ్తున్న అనంత్‌నే చూస్తున్నాను.

పెళ్లికి పునాది నమ్మకం. ఆ పునాది మీద వివాహమనే భవంతి నూర్రేళ్ల కాలం నిలబడాలంటే ఆ నమ్మకానికి బలం ఉండాలి. లేక ఆ నమ్మకం గుడ్డిదైనా అయి ఉండాలనిపించింది నాకు.

## శ్రద్ధ

**ఆరోగ్యానికి మించింది ఏదీ లేదు. ఇప్పుడు తారలంతా తమ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు. అమృతారావ్ ఇప్పుడు స్లిమ్‌గా తయారవ్వడానికి ఎక్కువ టైం కేటాయిస్తోంది. 'ఇలా చేయకపోతే అవకాశాలు రావు. వచ్చిన అవకాశాలు మరిన్ని అవకాశాలకి నాంది కావాలి. ప్రేక్షకులు ఎప్పుడూ కొత్తదనం కోసం చూస్తున్న రోజులివి. తారల్లో కూడా ఈ లక్షణాల్ని వారు వెదుకుతున్నారు' అంటోంది అమృతా. అయితే ఈమెకి అందాన్నిచ్చే కొన్ని భాగాలు ఫేడ్ అయిపోయాయని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఈ సంగతి ఆమెకి తెలుసో లేదో?**

